క్లుప్తంగా

సింగిల్ విండో అధ్యక్ష పదవికి రాజీనామా



బ్యాంక్ సీఈఓకు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల సింగిల్ విండో అధ్యక్ష పదవికి ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి రాజీనామా చేశారు. సోమవారం దేవపట్ల సహకార బ్యాంక్ సీఈఓ అన్సర్‌కు ఆయన రాజీనామా పత్రాన్ని అందజేశారు.

మండల సమావేశం వాయిదా

పుల్లంపేట : మంగళవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కొన్ని అనివార్య కారణాలు వలన వాయిదా వేస్తున్నట్లు ఏఓ ఖాన్ తెలిపారు. కావున సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల అధికారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

14 నుంచి మారెమ్మ పొంగళ్లు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీలో వెలసిన మారెమ్మకు ఈనెల 14వ తేదీ నుంచి అమ్మవారి పొంగళ్ల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14వ తేదీ శుక్రవారం ఆలయంలో మహాగణపతి పూజ, ధ్వజారోహణం, గణపతి హోమం, మారెమ్మ తల్లి మూలమంత్ర హోమాలు నిర్వహిస్తామన్నారు. 15న ఉదయం 8 గంటలకు చండీహోమం, విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని కల్పించినట్లు ఆలయ కమిటీ తెలిపింది. అదే రోజు వివిధ గ్రామాల నుంచి విచ్చేసే భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. సోమవారం అమ్మవారికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు జరుపుతామని తెలియజేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

ఎల్లమ్మ తల్లికి పూజలు



పూజలందుకున్న ఎల్లమ్మ

పుల్లంపేట : మండల పరిధిలోని తిప్పాయిపల్లి గ్రామంలో నూతనంగా వెలసిన కొత్తపూరి ఎల్లమ్మ దేవాలయంలో వెలసి ఉన్న ఎల్లమ్మకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం చెక్కభజన కార్యక్రమం నిర్వహించారు. చెక్కభజన కార్యక్రమం చూపరులను అలరించింది.

గర్భిణులకు భోజన సదుపాయం



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ

వీరబల్లె : వీరబల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం ఎస్ఎంఎస్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు మధ్యాహ్న సమయంలో భోజన సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి ప్రతినెలా సేవాభావంతో మండల ప్రజలకు భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

జేఈఈలో మెరిసిన ఆణిముత్యం

రామాపురం : ఆదివారం విడుదల చేసిన 2024 జేఈ అడ్వాన్స్ ఫలితాలలో బొందల విష్ణువర్ధన్ ఆల్ ఇండియా ఓబీసీ కేటగిరిలో 207వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. బి.విష్ణువర్ధన్ అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలో నల్లగుట్టపల్లి గ్రామం కొత్తపల్లికు చెందిన బొందల వెంకటరమణ కుమారుడు బొందల విశ్వనాథ్(ఉపాధ్యాయులు) సతీమణి బొందల నాగరత్నల చిన్న కుమారుడు. చిన్ననాటి నుంచి చదువులో ప్రతిభ కనబరుస్తూ జేఈఈలో మెరుగైన ర్యాంకును సాధించారు. బంధువులు, మిత్రులు విష్ణువర్ధన్‌కు అభినందనలు తెలియజేశారు.

21న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పీలేరు రూరల్ : ఈ నెల 21న పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపనున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. పీలేరు డిపో ఎక్స్‌ప్రెస్ టికెట్ రూ. 700, ఒక ఆర్డినరీ టికెట్ రూ. 650 నడుపుతున్నట్లు తెలిపారు. ఎక్స్‌ప్రెస్ బస్సు మధ్యాహ్నం 1 గంటకు, ఆర్డినరీ బస్సు తెల్లవారుజాము 5 గంటలకు బయలుదేరుతాయని తెలిపారు. వివరాలకు కె.వి. రమణ 7893152748 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రజా గొంతుకగా పని చేద్దాం

- ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం
- ఎన్డీయే ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించాలి
- కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కొరముట్ల శ్రీనివాసులు



పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

రైల్వేకోడూరు అర్బన్ : రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ప్రజలకు సేవ చేయడమే మన లక్ష్యమని, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ మనందరం సమష్టిగా ప్రజల గొంతుకలై సమస్యలపై ప్రజల వాణిని వినిపిస్తూ వారికి అండగా నిలుద్దామని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సోమవారం తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, తాను అన్ని వేళలా అందుబాటులో ఉంటూ అండగా ఉంటామన్నారు. అధికారం ఉన్నా, లేకపోయినా మనం ఎల్లప్పుడూ ప్రజలలో ఉంటూ వారికి అండదండగా ఉండటమే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనకు నేర్పించారని తెలిపారు. అదే మనకు, పార్టీకి కొండంత అండని పేర్కొన్నారు. ఐదు సంవత్సరాలలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు మరచిపోరని చెప్పారు. 70 వేలకు పైగా ఓట్లు మనకు పోలయ్యాయంటే ప్రజలు మన వెంట ఉన్నారనేది ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉంటూ ప్రజల అవసరాలకు అనుగుణంగా సాగించిన అభివృద్ధిని కొనసాగించే విధంగా పోరాడుదామన్నారు. తనను గెలిపించడం కోసం కార్యకర్తలు, నాయకులు ఎంతో కష్టపడ్డారని వారికి ఎల్లప్పుడు రుణపడి ఉంటానన్నారు. 2014లో ఇదే కూటమిని ఎదుర్కొని విజయం సాధించామని గుర్తు చేశారు. చంద్రబాబు అతి వాగ్దానాలను పేద ప్రజలు నమ్మారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నైజం మనందరికి తెలిసిందేనని, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరిస్తారని ప్రతి పేదవాడికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఏ ఒక్కరికి అన్యాయం జరిగిన వారికి అండగా వైఎస్సార్‌సీపీ ఉంటుందని హామీనిచ్చారు. పార్టీలో కొద్దిపాటి తప్పులు ఏమైనా ఉంటే వాటిని సరిదిద్దుకుని పని చేద్దామని సూచించారు. ఈ రోజు వారిది, రేపు మనదని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. ప్రతి కార్యకర్తను అనుక్షణం కాపాడుకుంటామని తెలియజేశారు. పార్టీలో వ్యక్తుల మధ్య విభేదాలు ఉంటే పక్కన పెట్టి పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ప్రతిపక్షాల్లో ఉన్న నాయకులు, ప్రజలకు ఆనాడు సీఎం సహాయనిధితో ఆదుకున్నామని అది అందరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. ఓడినందుకు చింతించలేదని, నాలుగు సార్లు ప్రజలు నన్ను గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతగా ఉంటానన్నారు. ఐదు సంవత్సరాలలో మొదలు పెట్టిన శాశ్వత అభివృద్ధి పనులను అధికార పార్టీ కొనసాగించాలని కోరారు. గత ఎన్నికల్లో మన పార్టీ ఎన్నికలలో గెలిచిన ఏ రోజు దాడులను, హింసను ప్రోత్సహించలేదన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై జరుగుతున్న దాడులకు ఎవరూ సంయమనం పాటించాలన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నియోజకవర్గ అభివృద్ధికి మన అధినేత వైఎస్ జగన్ ఎంతో సహకరం అందించారని ఆయన మేలు నియోజకవర్గ ప్రజలు మరువరని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, మార్కెట్ చైర్మన్ సుబ్బరామరాజు, మందల నాగేంద్ర, సర్పంచ్‌లు చంద్రశేఖర్, గోపి, రమణ, రంగారెడ్డి, రాజ, సలామ్, శివారెడ్డి, ఓబుల్ రెడ్డి, బత్తల సుబ్రమణ్యం, శ్రీనివాసులు రెడ్డి, అనిల్, మందల శివయ్య, రాజ, ప్రతాప్ రెడ్డి, కె.జ్యోతి, అరుణ, పుష్పలత, రఘు, రత్తయ్య, కె.నాగేంద్ర, శివారెడ్డి, శిల్పిరెడ్డి నాగేంద్ర, బి.సుబ్రమణ్యం, కరిముల్లా, ఎంపీటీసీ మల్లి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పెనగలూరులో మోస్తరు వర్షం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండలంలో గత రెండు రోజుల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. సోమవారం 13.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాలు లేక పండ్ల తోటలు ఎండిపోతున్న తరుణంలో వర్షం కురవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అనేక మంది నూతనంగా బోర్లు వేసి నీళ్లుపడకపోవడంతో నిరుత్సాహపడ్డారు. ఈ తరుణంలో ఈ వర్షం రైతులకు ఎంతో మేలు చేసింది.

17న బక్రీద్

మదనపల్లె సిటీ: బక్రీద్ పండుగ ఈనెల 17న (సోమవారం) నిర్వహించనున్నట్లు ప్రభుత్వ సర్‌ఖాజీ ఇక్బాల్ అహ్మద్ తెలిపారు. ముస్లిం సోదరులు పండుగను పవిత్రంగా జరుపుకోవాలని సూచించారు.

మాతృత్వ అభియాన్‌పై అవగాహన ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళలు ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌పై అవగాహన కలిగి ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. కడప నగరం నాగరాజుపేటలోని అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో మహిళలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలు నెలసరి ఆగిన 12 వారాల్లోపు ఏఎన్ఎం దగ్గర పరీక్ష చేయించుకుని పాజిటివ్ వస్తే గర్భిణిగా నమోదు చేయించుకుని, తమతో శిశుసంరక్షణ కార్డులో అన్ని వివరాలు నమోదు చేసి ఐడీ నంబర్ పొందాలన్నారు. తొలుత టీటీ ఇంజెక్షన్ ఇచ్చి నెల తర్వాత రెండో ఇంజెక్షన్ ఇస్తారన్నారు.

మహాభారతం ఓ పవిత్ర గ్రంథం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం : మహాభారతం ఓ పవిత్ర గ్రంథమని రాయచోటి శాసనసభ్యుడు రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం మండల కేంద్రంలోని జరుగుతున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో పంచ పాండవులు ద్రౌపతి మాత ఉత్సవ విగ్రహాలను సందర్శించి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేయడంతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండడమే కాకుండా పంటలు బాగా పండి అందరూ సమృద్ధిగా ఉంటారని నమ్మకంతో మహాభారత యజ్ఞాన్ని ప్రజలకు వినిపించడం ఎంతో సంతోషదాయకమన్నారు. మహాభారతాన్ని వినడం గానీ, చదవడం గానీ చేస్తే ఎంతో పుణ్యం లభిస్తోందని తెలిపారు. కార్యక్రమం ఏర్పాటు చేసిన కమిటీని అభినందించారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సుగవాసి విద్యాధర్, మండల మహాభారతం కమిటీ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మద్దిరేవుల రమేష్‌రెడ్డి, రవికుమార్, వెంకటరామిరెడ్డి, ఎం.ఎల్.వెంకట్రామిరెడ్డి, సహదేవరెడ్డి, భగవాన్రెడ్డి, నాని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యపూజ స్వామి కోనకు పాదయాత్ర



కోనకు పాదయాత్ర చేస్తున్న కూటమి నేతలు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం నుంచి ఎన్డీయే కూటమి నేతలు సోమవారం శ్రీ నిత్యపూజ స్వామి కోనకు పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా టీడీపీ పార్లమెంటరీ కార్యదర్శి నాగముని రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో మొక్కుబడి చెల్లించుకునేందుకు పాదయాత్ర చేపట్టామన్నారు. రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందడానికి కూటమి పార్టీల ప్రభుత్వం తోడ్పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంజి సుబ్బరాయుడు, పుత్తా రామచంద్రయ్య, రాజానాయుడు, చెంచయ్య నాయుడు, రాజశేఖర్, అయ్యప్ప నాయుడు, జె.వెంకటసుబ్బారెడ్డి, బి.ఓబులయ్య, మైనార్టీ నాయకుడు మహబూబ్‌బాషా, జనసేన నాయకుడు రాటాల రామయ్య, బీజేపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి



షాపులో రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న రమేష్ బాబు

రాజంపేట రూరల్ : వ్యవసాయ రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు జి.రమేష్ బాబు ఆదేశించారు. మండల పరిధిలోని పలు విత్తన డీలర్ల షాపులను సోమవారం సహాయ వ్యవసాయ సంచాలకులు ఆకస్మిక కమిటీ చేశారు. షాపులలో డీలర్లకు చెందిన రిజిస్టర్లు, బిల్ బుక్కులు తనిఖీ చేశారు. రిజిస్టర్లు, బిల్లు బుక్కులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని డీలర్లను ఆదేశించారు. విత్తనములు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. బిల్లులు ఇవ్వని డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సారిక తదితరులు పాల్గొన్నారు.

పుంజుకుంటున్న టమాటా ధరలు



మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

మదనపల్లె సిటీ: టమాటా ధరలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇతర రాష్ట్రాల్లో పంట దిగుబడులు తగ్గుముఖం పట్టాయి. దీంతో మదనపల్లె మార్కెట్‌లో ధరలు పెరుగుతున్నాయి. సోమవారం మొదటి రకం కిలో రూ.62 పలికింది. సుమారు 564 మెట్రిక్ టన్నుల కాయలు వచ్చాయి. రైతుల నుంచి వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ధరలు పెరుగుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో పంటలు దెబ్బతింటున్నాయి. మదనపల్లె టమాటా మార్కెట్‌లో నాణ్యమైన కాయలు వస్తుండటంతో వ్యాపారులు మదనపల్లె మార్కెట్‌కు వస్తున్నారు. ధరలు ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

పచ్చదనం పరుచుకున్న హార్సిలీహిల్స్

హార్సిలీహిల్స్‌పై పచ్చదనం పరుచుకుంటోంది. వేసవిలో అడవి పచ్చదనం కోల్పోయి వృక్షాలు, మొక్కలు వాడిపోయి చల్లదనం కరువైంది. ఎటుచూసిన ఎండిపోయిన అడవి తప్ప పచ్చదనం కానరాలేదు. ఇటీవల వర్షాలతో హార్సిలీహిల్స్, చుట్టూ ఉన్న కొండలు పచ్చదనంతో అలరిస్తున్నాయి. చల్లటి గాలులతో వాతావరణం ఆహ్లాదపరుస్తోంది. దీనితో కొండకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. -బి.కొత్తకోట



ప్రకృతి అందాలతో అలరిస్తున్న హార్సిలీ హిల్స్

రోడ్లపైనే వాహనాల పార్కింగ్

ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



యథేచ్ఛగా రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేసిన వాహనదారులు

గాలివీడు : ప్రధాన రహదారిపై ద్విచక్ర, ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. పట్టణ సుందరీకరణ, రహదారి విస్తరణలో భాగంగా గాలివీడు మండల కేంద్రంలో బస్టాండు నుండి గేటు వరకు నాలుగు వరుసల రహదారిగా విస్తరించారు. అందులో భాగంగా రోడ్డు మధ్య భాగంలో డివైడర్ దిమ్మెను కూడా ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ప్రధాన రహదారికి ఇరువైపులా నివాసాల్లో ఉంటున్న ఇంటి యజమానులు తమ వాహనాలను ఇంటి ముందు రోడ్డుపై పార్కింగ్ చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు గురి చేస్తున్నారు. దీంతో నాలుగు వరుసలు రహదారి కాస్తా రెండు వరుసల రహదారిగా కుదించుకుపోయింది. మూడు జిల్లా సరిహద్దు ప్రాంతం కావడంతో కదిరి, రాయచోటి, కడప, మదనపల్లె, లక్కిరెడ్డిపల్లెకు రాకపోకలు సాగించే బస్సు సర్వీసులు పట్టణంలోకి ప్రవేశించగానే ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రయాణీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ట్రాఫిక్ సమస్యపై అనేకమార్లు పోలీసులు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ వాహనదారులు మాత్రం బేఖాతరు చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇప్పటికైనా రోడ్డుపై వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పోలీసులకు మండల ప్రజలు కోరుతున్నారు.

పరామర్శ



గంగయ్యను పరామర్శిస్తున్న ఎంపీపీ తదితరులు

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని చౌటపల్లె గ్రామం, గొల్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు చెల్లు గంగయ్య (చంద్రబాబు) అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, గడ్డం కళ్యాణి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దుర్గయ్య, మాజీ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, జగన్‌మోహన్‌రెడ్డి, శంకర్ నాయుడు, వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు అంబాబత్తిన రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు లల్లు యాదవ్, నాగేంద్ర బాబు, దొరకల్లు మోహన్‌కుమార్, గడ్డం జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మ పూజకు రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలం లోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్ హరిజనవాడలో వెలసిన అంకాలమ్మ పూజా కార్యక్రమానికి రాజంపేట జనసేన నాయకుడు అతికారి క్రిష్ణ రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఎస్‌కేఆర్ నగర్ హరిజనవాడలో ఈనెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అమ్మవారి తిరునాల జరుగనుంది. విరాళానికి సంబంధించిన నగదును సోమవారం సాయంత్రం స్థానిక ఎన్డీయే కూటమి నాయకులు గంజి సుబ్బరాయుడు, చంద్ర, బాలక్రిష్ణ వారి చేతులమీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

'శాఖాహారంతో ఆరోగ్య సమస్యలు దూరం'



మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

రాజంపేట టౌన్ : మనిషి శాఖాహారం తీసుకోవడం వల్ల దీర్ఘకాలికమైన కొన్ని ఆరోగ్య సమస్యలు దరిచేరవని భీమవరానికి చెందిన బ్రహ్మవిద్యారిష్ఠ తటపర్తి రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక సరస్వతి పిరమిడ్ ధ్యాన మందిరంలో సోమవారం ఆమె ఆత్మజ్ఞానంపై బోధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మీ పట్టణ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. శాఖాహారం వల్ల మనిషి ఆరోగ్యంగా ఉండటంతోపాటు జ్ఞానోదయం పెంపొందుతుందన్నారు. మాంసాహారం తినడం వల్ల మెదడు మందగిస్తుందని, అందువల్ల మనిషి ఆలోచనల్లో చురుకుదనం లోపిస్తుందన్నారు. ప్రస్తుతం కొన్ని జబ్బులు మాంసాహారం తినడం వల్లే సంక్రమిస్తున్నాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మాంసాహారానికి దూరంగా ఉండాలన్నారు. శాఖాహారం తీసుకుంటే మెదడు చురుకుగా పనిచేస్తుందన్నారు. మనిషి ఆహారపు అలవాట్లతోపాటు సమాజంలో మంచి నడవడికను అలవరుచుకోవాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం ఏదో ఒక సమయంలో విధిగా ధ్యానం చేయాలన్నారు. అలాగే భగవంతుడి స్మరణలో ఉండాలని అప్పుడే మనిషి మనసును తన అదుపులో ఉంచుకోగలడని తెలిపారు. ప్రస్తుతం టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతోందని, ప్రపంచమంతా కొత్తదనం వైపు పరుగెడుతోందని చెప్పారు. ఈ కారణంగా అనేక మంది తాము కూడా ఇతరులతోపాటు విలాసవంతమైన జీవనాన్ని గడపాలన్న కోరికతో డబ్బు సంపాదన కోసం కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడిపే మధురమైన క్షణాలకు దూరమవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మనిషికి సంపూర్ణమైన ఆరోగ్యం, సంతోషకరమైన జీవనానికి మించిన సంపద మరొకటి లేదన్నారు. సమాజంలో అందరూ సన్మార్గం వైపు పయనించే దిశగా తమ జీవనశైలిని మార్చుకోవాలని కోరారు. అప్పుడే ఆనందకరమైన జీవనం సాగించేందుకు వీలవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ ప్రతినిధులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

గో రక్షణను అమలు చేయండి

కడప కల్చరల్ : దేశంలో గోవును తల్లిగా భావిస్తారని, అలాంటి వాటి రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన చట్టాలను కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ స్థానిక ప్రతినిధులు ఏఎస్పీని కోరారు. సోమవారం వీహెచ్‌పీ నాయకులు అడిషనల్ ఎస్పీ లోసారి సుధాకర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల్లో గల పశువుల యజమానుల వివరాలను జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారుల సహకారంతో సేకరించి ఆ పశువులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా చూడాలని కోరారు.

కలికి 'తురాయి'



మోటకట్ల సమీపంలో చూపరులను ఆకట్టుకుంటున్న దృశ్యం

ప్రకృతి అనగానే.. ప్రధానంగా ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేవి చెట్లు.. అందులోనూ పుష్పించే చెట్లు అంటే.. ప్రతి ఒక్కరికీ ఎంతో మక్కువ.. వృక్ష ప్రేమికులు వారి ఆవరణాలలో పలు రకాల చెట్లను పెంచుకోవడం పరిపాటి. ఇందులో భాగంగా జాతీయ రహదారులు, గ్రామీణ రహదారుల వెంట ఇరువైపులా పుష్పించే అందమైన వృక్షజాతులను పెంచుతూ ప్రయాణీకులకు, బాటసారులకు, ప్రజలకు ఆహ్లాదభరితాన్ని పంచుతూ ప్రకృతి రమణీయతకు చిరునామాగా మొక్కలు నిలుస్తున్నాయి. ప్రధానంగా కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని సంబేపల్లె మండలం మోటకట్ల సమీపంలోనూ, యర్రగుంట్ల బస్టాప్ సమీపంలో ఎర్రటి పూలతో తురాయి చెట్లు పుష్పించి రహదారికి నూతన శోభను అందిస్తూ చూపరులను ఆకట్టుకుంటోంది.

– సంబేపల్లె



ఎర్రటి పూలతో పుష్పించిన తురాయి చెట్టు